క్లుప్తంగా

గాజీపూర్‌లో అన్నదానం



తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలో గణనాథుడికి పూజలు కొనసాగుతున్నాయి. గ్రామంలోని శివాజీ యువజన సంఘం సభ్యులు సోమవారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ నెల 4న వినాయక నిమజ్జనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పట్నం

యాలాల: మండల మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా కుటుంబ సభ్యులను సోమవారం పలువురు నాయకులు పరామర్శించారు. ఆయన తల్లి సరోజనమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆధ్యాత్మిక చింతన అవర్చుకోవాలి

మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్



పూజలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

పరిగి: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని బోయవాడలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, నర్సింలు, రాజు, ఆంజనేయులు, గోపాల్, వెంకటేశ్ వినాయక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం



వాల్‌పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కుల్కచర్ల: స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వైఆర్‌జీకే స్వచ్ఛంద సంస్థ డీఆర్పీ రాంరెడ్డి, సాల్వీడు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రయ్య అన్నారు. సోమవారం మండలంలో వైఆర్‌జీకే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మన ఆరోగ్యం మన హక్కు అనే కార్యక్రమాన్ని నిర్వహించి పలు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని చెప్పారు. విద్యార్థులు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ మండల కోఆర్డినేటర్ రాంచంద్రయ్య, సూపర్‌వైజర్ రాములు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానానికి పోరాటం



ధర్నాలో పాల్గొన్న పీఆర్టీయూ నాయకులు

కుల్కచర్ల: పాత పెన్షన్ విధానాన్ని అమలుల్లోకి తెచ్చేందుకు తమ పోరాటం నిర్విరామంగా కొనసాగుతుందని కుల్కచర్ల మండల పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ అన్నారు. సోమవారం రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఇందిరా పార్క్ దగ్గరకు చేరుకుని రాష్ట్ర పీఆర్టీయూ సంఘానికి మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగుల చిరకాల కోరికను తీర్చి ఉద్యోగులకు ఉపశమనాన్ని కల్గించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నర్సింలు, వెంకటయ్య, అపర్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’పై సామాజిక తనిఖీ

- నేడు మండల ప్రజాదర్బార్
- గ్రామాల్లో పర్యటించిన బృందం



దౌల్తాబాద్‌లో నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ గ్రామసభ

దౌల్తాబాద్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై మండలంలోని గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన వివిధ రకాల పనులను గ్రామాల వారీగా ప్రత్యేక బృందం సభ్యులు ఆరా తీశారు. గ్రామాలలో వలసలు నివారించి స్థానికంగా ఉపాధి కల్పించేదుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీని పకడ్బందీగా అమలు చేస్తున్నాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, వ్యయం కూలీల చెల్లింపులతో పాటు వివిధ రకాల అంశాలను బృందం సభ్యులు పరిశీలిస్తారు. ఈ పథకంలో పారదర్శకతతో పాటు జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు తనిఖీ చేస్తుంటారు.

ఒక ఎస్సార్పీ.. 11 మంది బీఆర్పీలు

సామాజిక తనిఖీలో భాగంగా మండలానికి ఒక ఎస్‌ఆర్పీతో పాటు 11 మంది బీఆర్పీలను నియమించారు. వీరు బృందంగా ఏర్పడి ఆగస్టు నెల 21 నుంచి 31 వరకు అన్ని గ్రామాల్లో పర్యటించారు. పనుల్లో జరిగిన అవకతవకను గుర్తించడతో పాటు నాణ్యతలను పరిశీలించారు. అనంతరం సంబంధిత గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో గ్రామ సభలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

రూ.6 కోట్లకుపైగా ఖర్చు

2024–25 ఆర్థిక సంవత్సరంలో మండలానికి సుమారు రూ.6 కోట్లకుపైగా ఖర్చు చేశారు. పంచాయతీ రాజ్‌లో ఉపాధిహామీ నుంచి సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీల భవనాలు, కిచెన్‌షెడ్లు, కంపౌండ్ వాల్‌ల నిర్మాణాలను సైతం చేపట్టారు. అలాగే ఉపాధిలో వివిధ రకాల పనులు చేసిన కూలీలకు వేతనాలు చెల్లించారు. వీటిపై మండలస్థాయిలో చర్చించి సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు.

నేడు ప్రజాదర్బార్

మండల కేంద్రమైన దౌల్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు ఉపాధి హామీ ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు మండల అధికారులు తెలిపారు. గ్రామాల వారీగా బృందం సభ్యులు నిర్వహించిన తనిఖీల వివరాలను బహిరంగంగా చదివి వినిపిస్తారు.

రోడ్డుపై నూర్పిళ్లు.. రాకపోకలకు తిప్పలు



చిలుముల్ మైల్వార్ సమీపంలో రోడ్డుపైనే కల్లం

దుద్యాల్: రోడ్లే కల్లాలుగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని చిలుముల మైల్వార్ సమీపంలో రైతులు పండించిన మినుము నూర్పిళ్లు చేసేందుకు రోడ్లను ఉపయోగిస్తున్నారు. పొలంలో కల్లాలు ఏర్పాటు చేసుకోవడానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద గతంలో నిధులు మంజూరు చేసేవారు. ప్రస్తుతం కల్లాలు ఏర్పాటుకు నిధులు నిలిపివేశారు. దీంతో రోడ్లపైనే పంటల నూర్పిళ్లు కొనసాగిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి. కొన్నిసార్లు ప్రమాదాలు సైతం సంభవిస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహిపాల్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మహిపాల్‌రెడ్డి

తాండూరు రూరల్: తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం జనగాంలో 19 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దేముల్ మండలంలో 798 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పేదలకు గృహాలు ఇచ్చిన దాఖలాలే లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, నాయకులు మల్లేశం, గోపాల్‌రెడ్డి, శివకుమార్, విజయ్‌కుమార్, నర్సింలు, ఫకీరప్ప, అంతప్ప, మైపూజ్ ఉన్నారు.

రాజకీయ కుట్రలో భాగమే సీబీఐ

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి తదితరులు

యాలాల: కక్షపూరిత చర్యలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్‌పై సీబీఐని రాష్ట్ర సర్కార్ పురమాయించిందని బీఆర్‌ఎస్ యాలాల మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల్లో కేసీఆర్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సాగు, తాగునీటి విషయంలో కేసీఆర్ ఆలోచన విధానం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ఎలాగైన ఆయన్ని ఇబ్బంది పెట్టాలనే ఆలోచనతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని సీబీఐని నియమించడం ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలో భాగమే సీబీఐ కుట్ర అని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కాగా తాండూరులో ఇసుక, మొరం, నాపరాతి దోపిడీ రాజ్యం అమలు అవుతుందని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా తాండూరు ప్రాంతం నుంచి కొడంగల్‌కు ఇసుక, మొరం అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ వడ్డే రాములు, బీఆర్‌ఎస్ యూత్ విభాగం మండల అధ్యక్షుడు విక్రాంత్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ క్రిష్ణకుమార్, నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, రఘు రెడ్డి, లాలప్ప తదితరులు ఉన్నారు.

బేస్‌మెంట్ బిల్లు జమ

ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో జిల్లాలో తాండూరు మండలం మొదటి స్థానంలో ఉందని ఎంపీడీఓ విశ్వప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 33 గ్రామాల్లో 859 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 282 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం బేస్‌మెంట్ బిల్లు రూ.లక్షను వారి ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. ఇంకా 349 ఇళ్లు పునాది పూర్తి చేసుకొని బేస్‌మెంట్ దశలో ఉన్నాయన్నారు. మిగతావి ఇప్పటివరకు ప్రారంభం కాలేదని వివరించారు. బేస్‌మెంట్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరికి కూడా బిల్లు జమ అవుతున్నాయన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

చేవెళ్ల: గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి ప్రభుత్వ స్థలాలు కేటాయించి.. పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ కృష్ణయ్యకు సీపీఐ నాయకులు న్యాలట రెవెన్యూలో ఉన్న ప్రభుత్వ భూమి 7 ఎకరాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని న్యాలట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 240లో 7 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఇందులో ఆ రెవెన్యూ పరిధిలోనే ఉన్న న్యాలట, సింగప్పగూడ, రామన్నగూడ గ్రామాల్లోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలోనే ఈ సర్వే నంబర్‌లో కొంత మంది పేదలకు ప్లాట్లు చేసి ఇచ్చారన్నారు. కానీ ఈ ప్రభుత్వ భూమిని కొంత మంది కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. మరికొంత నాయకులు ప్లాట్లు ఉన్నాయని, అమ్మకాలు కూడా చేసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సత్తిరెడ్డి, ఎండీ.మక్బుల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, కృష్ణ, పాపయ్య, శివ, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

పాత విద్యుత్ వైర్లను తొలగించాలని వినతి

శంకర్‌పల్లి: పట్టణం, మండలంలో కాలం చెల్లిన పాత విద్యుత్ వైర్లను తొలగించి, కొత్త వైర్లను బిగించాలని సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం శంకర్‌పల్లి విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్‌కు ఆయన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రవీందర్, మహేందర్‌రెడ్డి, వైభవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు

చేవెళ్ల: యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా అసెంబ్లీ, మండల కో-ఆర్డినేటర్లుగా నూతనంగా ఎన్నికై న సభ్యులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు ప్రభుత్వ క్యాంపు కార్యాలయం వద్ద ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అభినందించి శాలువాలతో సన్మానించారు. యూత్ కాంగ్రెస్ చేవెళ్ల అసెంబ్లీ కో-ఆర్డినేటర్‌గా పి. మహేశ్వర్ రెడ్డి, మండల కో-ఆర్డినేటర్లుగా వెంకటేశ్, పి.ప్రశాంత్‌రెడ్డి ఎన్నికై నట్లు తెలిపారు. యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు జనార్దన్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, పాండుగౌడ్, ప్రభాకర్, నర్సింలు, చాన్‌పాషా ఉన్నారు.

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



కుల్కచర్ల జీపీలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను అందిస్తున్న నేతలు, అధికారులు

కుల్కచర్ల: పేద ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ సిద్ధాంతమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్దిదారులకు నూతన రేషన్‌కార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పాలనలో ఒక్కరికి కూడా రేషన్‌కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. తాము అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడంతో పాటుగా ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ భాస్కర్ గౌడ్, ఆర్ఐ రవి, మాజీ ఎంపీటీసీ ఆనందం, ఇందిరమ్మ కమిటీ కోర్డినేటర్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లంబోదరుడి పూజలు



ధారూరు: లడ్డూను దక్కించుకున్న మల్లేశ్



వికారాబాద్ మోతీబాగ్ కాలనీలో గణనాథుడి పూజలో దీపోత్సవం



వికారాబాద్‌లో వినాయకుడి పూజలో భక్తులు

ధారూరు: మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి గ్రామ పంచాయతీ వినాయకుడి లడ్డూను వేలం వేయగా గ్రామానికి చెందిన రైతు తిరుపతిగారి మల్లేశ్ రూ.72 వేలకు దక్కించుకున్నారు. అలాగే వీరహనుమాన్ మందిరం వినాయకుని లడ్డూను సాయిగౌడ్ రూ.66 వేలకు తీసుకున్నారు. సోమవారం సైతం వికారాబాద్‌లో గణనాథులకు పూజలు కొనసాగాయి.

నివాసాల మధ్య మురుగు.. వెళ్లేదెలాగో అడుగు



మండల పరిధిలోని చిలుముల్ మైల్వార్ గ్రామంలో ఇళ్ల మురుగు నిల్వల నుంచి దుర్గంధం వ్యాప్తి చెంది కంపుకొడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు కొట్టుకొచ్చిన వర్షం నీరు ఇళ్ల మధ్య చేరిందన్నారు. అలాగే ఇళ్ల నుంచి వచ్చిన మురుగు ఇక్కడే చేరుతుందన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–దుద్యాల్

మహాగర్జనకు తరలిరావాలి



తాండూరు రూరల్: పెన్షనర్లతో సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు



యాలాల: పింఛనుదారులతో సమావేశమైన నాయకులు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌మాదిగ

తాండూరు రూరల్: వృద్ధులు, వితంతువులకు పెన్షన్ పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గట్టగల ప్రశాంత్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని చెంగోల్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి జినుగుర్తి నర్సిములు మాదిగ ఆధ్వర్యంలో పెన్షన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోని రాకముందు చేయూత కింద వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని మరిచారని చెప్పారు. పింఛన్ పెంచాలని ఈ నెల 9న హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జనకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జగదీష్‌మాదిగ, గ్రామస్తులు రవి కుమార్, నారాయణరెడ్డి, వీరప్ప, వెంకటయ్య, భీమప్ప, బాలమ్మ, లక్ష్మి, లాలమ్మ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ వెంటనే పెంచాలి

యాలాల: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు అందజేస్తున్న పింఛను డబ్బులను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మెట్లి సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం దేవనూరు గ్రామంలో పింఛనుదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4వేలకు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 9న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి

బంట్వారం: వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి అన్నారు. సోమవారం బంట్వారం సహకార సంఘం సర్వసభ్య సమావేశం సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నామన్నారు. తీసుకున్న రుణాలను రైతులు వాయిదాల ప్రకారం సక్రమంగా చెల్లిస్తే వడ్డీ తక్కువగా ఉంటుందన్నారు. రికవరీ 50 శాతం కంటే ఎక్కువగా ఉంటేనే నాబార్డు లాంటి సంస్థలు మరింత ఎక్కువగా అప్పు ఇచ్చేందుకు ముందుకు వస్తాయన్నారు. సంఘం అభివృద్ధికి రైతులందరూ సహకరించాలని సూచించారు. ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పదవీ విరమణ పొందిన సీఈఓ బ్రహ్మం దంపతులను సత్కరించారు. డీసీఓ నాగార్జున వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్లు రాధాకృష్ణగౌడ్, మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుల్కచర్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెడ్ కానిస్టేబుళ్లు ఖాజ, అంజిలయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వాహనదారులను తనిఖీ చేసి హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి టూ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా వాహనాలను నడిపే క్రమంలో హెల్మెట్‌ను తప్పకుండా పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడపడం, చిన్న పిల్లలకు ఇవ్వడం చేయొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురుగు పక్కనే భోజనం

దుర్గంధభరితమైన అసంపూర్తి గదులతో విద్యార్థులు అరిగోస పడుతున్నారు. సోమవారం మండల పరిధిలోని ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు బురద పక్కనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదులలో గ్రామస్తులు పశువులను కట్టేయడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఇప్పటికైనా గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

–బొంరాస్‌పేట



మురుగు పక్కన మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు